# నాకు మీరే కావాలి

ఇడుగు లక్ష్మీదత్

కమలమ్మగారు అప్పుడే భోజనం ముగించుకొని ముడి పట్టుబట్ట కూడా మార్చుకొని కాస్త ఎండ పొడ తగులుతుందని వీధి వరండాలోకి వచ్చారు. ముడి వేసుకున్న తడి జుట్టు విప్పి ఆరబెట్టే ప్రయత్నంలో వరండా రెండు మెట్లు దిగి మొక్కల మధ్యకు వచ్చారు.

బాగా విచ్చుకున్న గులాబీలని, విరగబూసిన చామంతులని చూస్తూ చెంబెడు నీళ్ళు, కాస్త ఎరువు వేస్తే చాలు. మీ కష్టానికి మా ఫలితం అన్నట్టు ఎలా పూసాయి! అని మనసులోనే అనుకొంటూ పరవశంగా చూస్తూ ఆ తడి కురులలోకి వేళ్ళు పోనిచ్చి జోరుగా చిక్కు తీసుకొంటున్నారు. ఇంతలోనే వీధి గేటు చప్పుడు చేస్తూ పోస్ట్‌మాన్ లోపలికి వచ్చి ఒకకార్డు ఒక కవరు అందించి వెళ్ళాడు.

వాటిని చూస్తూనే తెలిసిపోయింది. కూతురు శాంతి విశాఖ నుంచి అని, రెండోది కొడుకు సుధాకర్ నెల్లూరు నుంచి అని.

కూతురు కార్డు తనకు రాసిందే. ఆత్రంగా ఏం రాసిందో అని చదవసాగారు.

మ.ల.స. అమ్మకు,

నమస్కరించి వ్రాయునది. నీవు నాన్నగారు కులాసా అని తలుస్తాను నేను మీ అల్లుడుగారు పిల్లలం అంతా కులాసా. పిల్లలు స్కూలికి మీ అల్లుడుగారు ఆఫీసుకి వెళ్ళిపోతే అసలు తోచటం లేదు. సరదాగా టెంపరరీగా అయినా చిన్ని ఉద్యోగంలో చేరాలని అనుకుంటున్నాను. పిల్లలు అమ్మమ్మకై తెగ బెంగపెట్టుకొంటున్నారు అమ్మమ్మ చేతి వంట తినాలని తెగ మురిసి పోతున్నారు. నువ్వు ఎప్పుడు వస్తావా? అని ఎదురు చూస్తున్నారు

మీ అల్లుడుగారు అయితే సరేసరి.

మీ అమ్మగారు చేసినట్టు వంట నువ్వు ఏది చెయ్యవు అంటారు (నువ్వు) బొబ్బట్లు, కందిపచ్చడి, ఆవడలు ఇలాటివి చెయ్యటంలో మీ అమ్మగారిదే అగ్రతాంబూలం అంటారు.

"అమ్మకి పుత్తరం రాసాను." వచ్చేస్తుంది అని అందరిని ఊరిస్తున్నాను నువ్వు తప్పక వస్తావని మా అందరి ఆశలు తీరతాయని, నీ రాక కోసం ఎదురు చూస్తున్నాము. నువ్వు ఎప్పుడు వచ్చేది రాస్తే స్టేషన్‌కి వస్తాము. నాన్నగార్కి నా నమస్సులు చెప్పు.

ఇట్టు
మీ అమ్మాయి
శాంతి

కూతురు రాసిన పుత్తరం చదివి ఒక్క వేడి నిట్టూర్పు విడిచి కొడుకు ఏం రాసాడో అని అది కూడా చదవసాగింది. అందులో కొంత నాకు, కొంత వాళ్ళ నాన్నగార్కి రాసాడు. (అప్పుడప్పుడు సుధాకర్ వాళ్ళ అమ్మగార్కి తెలుగులోనే రాస్తాడు. తృప్తిగా చదువుకొంటుందని)

ఏముంది అంతా షరా మామూలే.

కోడలు నెల తప్పిందని, పైవాడు దుడుసుగా తెగ అల్లరి చేస్తున్నాడని పట్టుకోలేక వాడి అల్లరితో ఛస్తున్నామని, కోడలు నీరసంగా అసలు చేసుకోలేక పోతోందని. పెద్ద దిక్కుగా సహాయంగా వుండటానికి రమ్మని వెంటనే బయలుదేరమని.

ఏమిటో ఈ పిల్లలు, ఈ పుత్తరాలు. (పు)

మొన్న పెద్దవాడు ప్రభాకరం అంతే హైదరాబాదు నుంచి రాసాడు పుత్తరం.

ఇంటి ప్లాన వచ్చిందని, లోన్సు అన్నీ సాంక్షన్ అయినాయి ఇల్లు కట్టటం జనవరి నుంచి ప్రారంభిస్తామని. అమ్మని సహాయం కోసం పంపమని. ఇంట్లో అమ్మ వుంటే నాకు మీ కోడలికి ధైర్యంగా వుంటుందని. త్వరలో పంపమని.

ఈ పిల్లలకి ఎప్పుడూ అమ్మ అవసరాలే కాబోలు. వీళ్ళు అసలు పిల్లలేనా?

వీళ్ళని కన్నది నేను మాత్రమనా? వీళ్ళని పెంచి పెద్ద చేసి వీళ్ళ కోసం అహర్నిసలు పాటుపడిన తండ్రి ఉన్నాడన్న ఆలోచన వీళ్ళకి రాదా? అమ్మ అమ్మ అంటూ ప్రేమంతా అమ్మ మీదే వున్నట్టు అమ్మని రమ్మని రాస్తారేం? అసలు వీళ్ళని కన్నది మనమేనా? అన్నట్టు.... ఎందుకిలా రాస్తారు. (ఈ) వుత్తరాలు. నాన్నగారితో సహా రమ్మని ఎందుకు వ్రాయరు? అసలు తండ్రి వునికి గుర్తు రాదా? అమ్మ వస్తే తండ్రి కెలాగన్న విషయం స్ఫురణకు రాదా? అసలు తండ్రి విషయం ఆలోచించరేం? పోనీ! రాసారే అనుకో.

ఇద్దరు కలస రండి అని ఒక్కళ్ళంటె ఒక్కళ్ళు! అయినా వ్రాయరేం? ముసలితనం ముసురుతున్న తండ్రి ఎటు పనికి రాడని వీళ్ళ అభి'ప్రా'యమా? లేక ఏ పని వుండదు సరి కదా పనికి అ'డ్డ'ం అని వీళ్ళ బాధా! లేక ఎప్పుడూ చాదస్తంగా మాట్లాడుతూ, చెప్పినవే చెప్తూ, దగ్గుతూ మూలుగుతూ వుంటారని వీళ్ళకి చిరాకా!

ఎందుకు వ్రాయరు? ఇద్దరు కలసి రండి అని మాతోనే వుండండి అని రాస్తే మంచో చెడ్డో వాళ్ళ బాధ్యతలు మేం మాత్రం ఎందుకు పంచుకోము.

లేదూ పెద్దతనంలో తండ్రిని కష్టపెట్టట మెందుకనే సదభిప్రాయమా? వీళ్ళకి అసలు అంత దూరాలోచన వుండదా?

అమ్మని పంపమని రాస్తారు గాని అమ్మ వస్తే తండ్రిని ఎవరు చూస్తారు? అన్న ఆలోచన వీళ్ళకు ఎందుకు రాదు?

వయసు పెరుగుతున్న కొద్దీ మగవాళ్ళకి ఆడదాని అవసరం పెరుగుతుందని తెలియదా.

ఎప్పుడైనా కోడళ్ళని వుంచడ్రా అంటే "అబ్బ మాకు చాల ఇబ్బంది" అంటూ వెంటబెట్టుకొని పోతారే అలాంటి అనుబంధం మాకు వుంటుందని వాళ్ళు అనుకోరు కాబోలు.

ఏదో నాలుగు రోజులు, వారం రోజులు అంటే వెళ్ళవచ్చు. రోజుల తరబడి వుండి వాళ్ళకి సహాయం చెయ్యాలంటే ఎలా వీలవుతుంది. ఎంత కన్నపిల్లలు అయినా ప్రతిసారి అమ్మని పంపమంటూ వ్రాయటం వీళ్ళకి ఏం సబబు?

పోనీ మగపిల్లలు ఏదో రాసారు అంటే ఆడపిల్ల దీనికి అయినా తండ్రి గురించి ఆలోచించలేదా!

ఆ మధ్య పెద్దవాడి కూతురికి వంట్లో బాగుండ లేదని, హడావిడి చేసిందని అంటే అప్పటికప్పుడు ఆయన బాధ్యత కాస్త చూడమని పక్కవాళ్ళకు అప్పగించి వెడితే, వచ్చేటప్పటికి కడుపు నొప్పితో నానా అవస్థ పడ్డారు


క్రమపద్ధతిగా మందులు, వేళకి భోజనం, ఇవన్నీ సరిగ్గా లేకపోతే తండ్రి ఇబ్బంది పడతారని శాంతి అయినా ఆలోచించ లేదేం? పైగా.. బోర్‌గా వుందిట, నేను వెడితే ఉద్యోగంలో చేరుతుందిట అయినా ఈ వయసులో ఈయన్ని వదిలి వీళ్ళ అవసరాలకి నే

నెందుకు వెళ్ళాలి? చిన్నతనంలో తండ్రి గుండె లెక్కి ఆడలేదా' వాళ్ళని ఎత్తి మోసి జ్వరాలొస్తే జాగారాలు చేస ఎన్ని అవస్థలు పడలేదు ఆ తండ్రి

డబ్బులు కావాలంటే; సినిమాలు షికార్లంటే తండ్రిని బుట్లోస ఒప్పించి డబ్బులు లాక్కున్న ఈ పిల్లలేనా

బజారు వెడితే తండ్రి చుట్టూ చేరి వాళ్ళకు కావలసినవన్నీ కొనిపించుకొన్న ఈ పిల్లలేనా వీళ్ళు.

వీళ్ళ చదువులకై, ఉద్యోగాలకై ఎన్ని ఇబ్బందులు



ఎదుర్కోలేదు ఆయన?

అయినవాళ్ల సమంభ-లు అన్ని వదులుకొని, వాళ్ళు ప్రేమించిన పిల్లలనే వాళ్లకు చేసింది! వాళ్ల సుఖం కోరి కాదూ! మరి అలాటి అమృత హృదయుడైన తండ్రిని వదిలి మాటి మాటికి అమ్మని పంపమని వ్రాయటంలో వీళ్ళఉద్దేశ్యం ఏమిటి?

తండ్రిని కూడా రమ్మని ఎందుకు వ్రాయరు? అసలు. కన్న తండ్రిని ఎందుకు అలా .. వాడేసిన వస్తువులా పక్కకు నెట్టేస్తారు?

ఇలా సుళ్ళు తిరుగుతున్న ఆలోచనలతో రెండు వుత్తరాల్లు పట్టుకొని లోపలికి వెళ్ళిపోయారు.

* * * *

కమలమ్మగారు శ్రీరామ్మూర్తిగారు ఆదర్శదంపతులు. వీళ్లకి ఇద్దరు మగపిల్లలు ఒక్క ఆడపిల్ల. శ్రీరామ్మూర్తి గారు బ్యాంక్ ఉద్యోగం చేసి, రిటైరై కూడా ఐదేళ్లు అవుతోంది. మగపిల్లలిద్దరికీ మంచి చదువులు చెప్పించి, ఉద్యోగాలు వేయించి పెళ్ళిళ్ళు చేసారు వాళ్ళు ప్రేమించిన వాళ్లతో

ఆఖరిది ఆడపిల్ల కావటంతో తన ప్రావిడెంట్ ఫండ్‌లో సగం ఖర్చుచేసి తిరిగి చూడని సంబంధం చేసారు.

ఇలా బాధ్యతలన్నీ తీర్చుకుని ఉన్న ఊళ్లోనే హాయిగా కాలక్షేపం చేస్తున్నారు. ఎవరి మీద ఆధారపడకుండా.

కమలమ్మగారు ఆ రోజుల్లోనే మద్రాసు కాన్వెంటులో చదువుకొన్నారు. మంచి తెలివితేటలతో, ఇటు పిల్లలని, అటు భర్తని నొప్పించకుండా. ఎంతో సమర్ధవంతంగా సంసారాన్ని నెట్టుకొస్తున్నారు. ఒక ప్రక్క తన ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ. అన్నిటా తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్న కమలమ్మగారంటే శ్రీరామ్మూర్తిగారికి ప్రాణం. ఆమె నీడలో నే ... తను కన్నుమూయాలని ఆయన ఆశ. ఆమె సహచర్యంలో ఆయనకు అంత తృప్తి. అలాటి భార్యను ఎలా పంపగలరు? .

* * * *

పక్కనే కిరాణా కొట్టుకు వెళ్ళిన శ్రీరామ్మూర్తి గారు అడుగులో అడుగే వేసుకొంటూ రానే వచ్చారు.

కమలా! మంచినీళ్లంటూ కుర్చీలో కూలబడ్డారు.


భర్త పిలుపు విన్న కమలమ్మగారు మంచినీళ్లతో పాటు వుత్తరాలు కూడా అందించింది.

అవి చదువుకున్న శ్రీరామ్మూర్తి గారు ఒక్క క్షణం ఏం మాట్లాడలేక ఒక్క నిట్టూర్పు విడిస్తూ ఏం పిల్లలో అనుకుంటూ కుర్చీకి వెనగ్గా వాలి క్షణం కళ్ళు మూసుకున్నారు. భార్యను ఎలా పంపించాలా? అని.

ఆ క్షణంలోనే ... మరల తేరుకొని భార్య నుద్దేశిస్తూ ... ఊ ... ఏం చేద్దామనుకుంటున్నావు. పోనీ! వెడితే వెళ్ళు. పిల్లలు ఏం అవస్థ పడుతున్నారో.

మీరు చెప్పేది బాగానే వుంది. అయినా ఎవరి దగ్గరకని వెళ్లను. అందరి అవసరం ఒకటే అయినప్పుడు.

ముగ్గురు కూడబలుక్కునిరాసినట్లు రాసారు. వాళ్లకి నా అవసరమేగాని నేను కాదు. వాళ్ళకి కావలసినది నా పని.




# వాగ్దానాలు

ధర్మప్రసాదం

మనలో వాగ్దానాలు చేసేవారు చాలామంది కానవస్తారు. కొందరు తమ పనులు జరుపుకోవడం కోసం ఇతరులకు తమపై గట్టి నమ్మకం కలుగజేస్తూ, తాము పై వారికి ఆశ చూపుతూ వాగ్దానాలు చేస్తూ ఉంటారు. తమ పని నెరవేరిన పిదప, తమ వాగ్దానం సంగతి పూర్తిగా విస్మరిస్తారు. ఇది, తమ పనిని నెరవేర్చుకొనుటకు పన్నిన పన్నుగడ అని అనుకోవలసి వస్తుంది. ఎదటివారు, ఆ వాగ్దానం సంగతిని హెచ్చరిస్తే, ఏవో సాకులు చెప్పి, తమ తప్పు కప్పి పుచ్చుకుంటారు. ఉద్యోగాలిప్పిస్తామని, అధికారులకు లంచాలివ్వాలని చెప్పి కొంత డబ్బును తీసికొనడం కూడా కొన్ని సందర్భాలలో కానవస్తుంది. వారు ఇదే వృత్తిగా పెట్టుకొని జీవించడం కనపడుతుంది.

కొందరి వాగ్దానాలు స్వార్థరహితంగా ఉంటాయి. వారు ప్రతిఫలాన్ని ఆపేక్షించకుండానే, కేవలం పరోపకారమే మనస్సులో పెట్టుకొని, తమ పలుకుబడిని, శక్తిని ఉపయోగించి పనిని నెరవేర్చి యితరుల ప్రశంసలను పొందుతారు. వారికి తనవారు, పై వారు, పరిచితులు, అపరిచితులు అనే భేదం ఉండదు. ఆ పనిని నెరవేర్చడానికి ఎంత శ్రమ అయినా పడతారు. అట్టి వారి పేరు శాశ్వతంగా నిలుస్తుంది.

వాగ్దానాలను చేసేవారిని ఆశ్రయించేవారు, తాము ఎట్టి వ్యక్తిని ఆశ్రయిస్తున్నదీ ముందుగా తెలుసుకోవాలి. వారిని గురించి ఇతరులు చెప్పే మాటలను పరిశీలించాలి. వాగ్దాతలకు ధనాశ ఉన్నదనే సందేహం కలగగానే, వారిని విడిచిపెట్టి, తమ కార్యాన్ని సాధించుకొనుటకు మరొక మార్గం చూసుకోవటం అన్ని విధాలా ఉత్తమం! లేకపోతే మోసపోవడం జరుగుతుంది. అయితే వాగ్దానం చేసేవారి తత్వం సర్వసాధారణంగా సులభంగా తెలియడం కష్టం. అందువల్ల వాగ్దానాలపయి ఆధారపడి ఏ పనికి సిద్ధపడకుండా ఉండడం ఉత్తమమైన పద్ధతి.

-బులుసు వేంకటరమణయ్య

వాళ్ళు అడ్డాల్లో బిడ్డలు కారు. అన్నీ తెలిసిన, రెక్కలు వచ్చి బాగా ఎగరగలిగే పక్షులు వాళ్ళు.

సంసారాలన్నాక ఎప్పుడు సమస్యలు వుంటూనే వుంటాయి. నేను వెళ్ళనంత మాత్రాన అవి సమసిపోవు.

అయినా నేను మాత్రం ఎక్కడికని వెళ్ళను. ఎవరికి సహాయంగా వుండను. అందరి అవసరం ఒకటే అయినపుడు ఒకరి దగ్గరకు వెడితే ఒకరికి కోపం వస్తుంది.

వెడితే మాత్రం వాళ్ళు అందలం ఎక్కించేదేముంది.

వాళ్ళ పిల్లల్ని చూడటం, వంట పని, వాళ్ళు బయటికి వెళితే వాళ్ళు వచ్చేటప్పటికి అన్నీ రడీ చెయ్యటం, వాళ్ళ కోసం వచ్చి పోయే జనానికి సమాధానాలు చెప్పటం.

ఇవేగా వాళ్ళు కోరుకునే సహాయం. ఆ వంటలక్క పని, ఆ కుక్క కాపలా పని నా వల్లకాదు.

ఇన్నాళ్ళు మన సంసారానికై చేసి చేసి నా బాధ్యతలన్నీ ముగించుకొని ఇప్పుడిప్పుడే ఊపిరి పోసుకుంటున్నాను.

## నాకు మీరే కావాలి

అయినా ... పిల్లలు రాసారు. వెళ్ళటం విధాయకమే కానీ ... ఒక్కడంటే ఒక్కడు ఇద్దరిని కలసి రమ్మని రాస్తే ఎలాగో ఇద్దరం వెళ్ళి బాధ్యతలను పంచుకోము! నిజానికి మన బాధ్యత వాళ్ళది కాదూ! కావలించుకుంటే అన్నీ బంధాలే. అన్నీ బాధ్యతలే. లేదంటే ఏది లేదు. వాళ్ళ కడుపున పుట్టిన వాళ్ళు అయినా సరే.

ఇలా మనకి మాత్రం ఒంటరిగా వాళ్ళకి దూరంగా వుండాలని సరదానా? వాళ్ళకి అవసరాలే గాని అభిమానాలు లేవు. వాళ్ళకి నేను అఖ్ఖరలేదు. నా పని మాత్రం కావాలి.

నాకు మీరు (మాత్రమే) కావాలి. నేను ఈ పెద్దతనంలో మిమ్మల్ని వదిలి వెళ్ళను. నాకు కడుపున పుట్టిన పిల్లలకన్నా మీరే ముఖ్యం. వాళ్ళని వాళ్ళు చూసుకోగలరు. వాళ్ళని చూడ్డానికి చాలామంది వున్నారు. మీకు నేను తప్ప ఎవరున్నారు? ఒక వేళ వెళ్ళినా నా మనసుకి స్థిమితం వుండదు. మీరు ఎలా వున్నారో అన్న ఆలోచనలతో.

నేను మిమ్మల్ని విడిచి వెళ్ళను. అంటూ తెగేసి చెప్పేసారు కమలమ్మగారు.

అట్లయితే పిల్లలకి ఏమని వుత్తరం వ్రాయమంటావు?

వున్న మాటే వ్రాయండి. "మీ అమ్మ లేనిదే నాకు జరగదని." వస్తే ఇద్దరం కలిసే వస్తామని. ఏదో ఇద్దరం ఒకరినొకరం చూసుకుంటూ ఆసరాగా నెట్టుకొస్తున్నాం గాని మా వోపికలు అంత మాత్రంగానే వున్నాయని. అంటూ భర్తకు చెప్పి కాఫీ టైము అయిందని అక్కడి నుంచి లేచారు కమలమ్మగారు.

* * * *

బాధ్యతగా వెంటనే పిల్లలందరికి వుత్తరాలు రాసి పడేసారు. ఇద్దరి ఆరోగ్యాలు సరిగా లేవని; కాస్త కోలుకున్నాక ఇద్దరం కలిసే వస్తామని.

* * * *

మరల పిల్లలెవరు అమ్మని పంపమని వుత్తరాలు వ్రాయలేదు. □